సాక్షి వైఎస్సార్ జిల్లా

బుధవారం । 18 । జూన్ । 2025



సమస్యల వలయంలో 'రిమ్స్'
కడపలోని రిమ్స్ సమస్యల వలయంలో చిక్కుకుంది. ఓపీ, ఐపీ విభాగాలలో రోగులు పలు రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. -8లో



ప్రారంభమైన బదిలీల కౌన్సిలింగ్
కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో ఉద్యోగుల బదిలీల జూమ్ కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.2/26.0

వాతావరణం
జిల్లాలో మంగళవారం 26.0 - 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

డీఎస్సీ పరీక్షకు 267 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షకు మంగళవారం 267 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 9 పరీక్షా కేంద్రాలకు సంబంధించి 1,514 మంది అభ్యర్థులకు గాను 1,307 మంది హాజరు కాగా 207 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం విడతలో 3 పరీక్షా కేంద్రాలకు సంబంధించి 545 మందికి గాను 485 మంది హాజరు కాగా 60 మంది గైర్హాజయ్యారు. మొత్తం 2,059 మందికి గాను 1,792 మంది హాజరు కాగా 267 మంది గైర్హాజరయ్యారు.

20న జాబ్ మేళా

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఐటీఐ ఉత్తీర్ణులైన, ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 20న కడప నగరంలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐలో ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ మైనారిటీస్ జిల్లా కన్వీనర్ జ్ఞానకుమార్ తెలిపారు. ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు తమ 10వ తరగతి మార్కుల జాబితా, ఐటీఐ మార్కుల జాబితా, ఐటీఐ ఎన్‌టీసీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోతోపాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు తీసుకుని హాజరు కావాలని పేర్కొన్నారు. వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని వారికి కావాల్సిన ట్రేడ్ విద్యార్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. పీఎఫ్, మెడికల్ అలవెన్స్‌తోపాటు క్యాంటీన్ సౌకర్యం కల్పిస్తారని వివరించారు.

సర్వసభ్య సమావేశానికి పటిష్ట భద్రత కల్పించండి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో ఈ నెల 20వ తేదీన నిర్వహించే సర్వసభ్య సమావేశానికి పటిష్ట భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు డైరెక్షన్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సర్వసభ్య సమావేశంలో తమకు రక్షణ కల్పించాలని, తమ హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని 39 మంది వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు హైకోర్టులో ఇటీవల పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై మంగవారం విచారణ జరిపిన న్యాయస్థానం సీరియస్‌గా స్పందించింది. గతంలో తాము ఇచ్చిన ఆదేశాలను పోలీసులు సక్రమంగా పాటించలేదని, గత సమావేశాల్లో జరిగిన పొరపాట్లు ఈ సమావేశంలో జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: వైఎస్ఆర్ కడప జిల్లా అడ్మిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సమగ్రశిక్ష కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులుగా పని చేయుటకు ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు(స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్స్) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నిత్యానందరాజులు తెలిపారు. ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్, అసిస్టెంట్ కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 21 నుంచి 30 వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఎన్‌జీవో కాలనీలోని అడిషినల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సమగ్రశిక్ష కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పని వేళల్లో కడపలోని అడిషినల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సమగ్ర శిక్ష కార్యాలయం వారిని సంప్రదించాలని వివరించారు.

ట్రాన్స్‌కో ఎస్ఈ బాధ్యతల స్వీకరణ



ట్రాన్స్ కో ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తిని సన్మానిస్తున్న ఇంజినీర్లు, ఉద్యోగులు

కడప కార్పొరేషన్: ఏపీ ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా సి.శ్రీరామ చంద్రమూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 132కేవీ, 220 కేవీ సబ్‌స్టేషన్లను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కార్మికులు, ఇంజినీర్లు సమన్వయంతో పని చేసి సంస్థకు మంచిపేరు తేవాలని కోరారు. అనంతరం విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీకే వీరభద్రయ్య, ఇతర అధికారులు, ఉద్యోగులు ఆయనకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు శ్రీనివాసరావు, విశ్వేశ్వర రెడ్డి, శ్రీనివాసరావు, ఈఈలు సుబ్రమణ్యం, నగేష్, రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, నరేంద్ర, నారాయణస్వామి, చంద్రశేఖర్, సతీష్, గోపాలుడు, డీఈలు వెంకటసుబ్బయ్య, రామ్మోహన్, అచ్యుత్‌రెడ్డి, విష్ణుకుమార్, రెడ్డి శేఖర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

కేజీఎఫ్ @ ఆర్టీపీపీ

- నాడు పోట్లదుర్తి బ్రదర్స్.. నేడు దేవగుడి సోదరుల దందా
- ఫ్లైయాష్ అక్రమ రవాణాలో ఆరితేరిన కూటమి నేతలు
- యాష్ ఫాండ్‌కు తరలించకుండానే అక్రమ రవాణా
- దోపిడీకి సరికొత్త ఎత్తుగడ.. నిత్యం లక్షలాది రూపాయలు స్వాహా
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న జెన్‌కో యంత్రాంగం



600 మెగావాట్స్ గేట్ ద్వారా వెళ్తున్న ఫ్లైయాష్ ట్యాంకర్లు



సాక్షి ప్రతినిధి, కడప: కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ ఆధారంగా తెరకెక్కిన కేజీఎఫ్ సినిమాను తలదన్నేలా.. ఆర్టీపీపీలో అక్రమ దందా తెరపైకి వస్తోంది. నాడు (2014–19) పోట్లదుర్తి బ్రదర్స్ హవా కొనసాగిస్తే.. తాజాగా దేవగుడి సోదరుల హవా నడుస్తోంది. గతంలో ఆర్టీపీపీ 600 ఎండబ్ల్యూ(మెగావాట్లు) ప్లాంట్ నిర్మాణం పేరుతో అక్రమ కార్యకలాపాలు నడిపేవారు. ఇప్పుడు కూడా 600 ఎండబ్ల్యూ గేట్ నుంచి అనధికారికంగా బల్కర్స్ ఇన్ అవుట్ అవుతున్నాయి. ఈఎస్‌పీ ఆఫర్స్ నుంచి ఫ్లెయిష్ దోపిడీ దందా కొనసాగిస్తున్నారు. ప్రతి రోజు తక్కువంటే రూ.2 లక్షలు జెన్‌కో ఆదాయం కోల్పోతుండగా, ఆ మొత్తం అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తోంది.

ఈఎస్‌పీ ఆఫర్స్ ద్వారా దోపిడీ

డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఆధారంగా అక్రమార్జన కోసం కూటమి ప్రభుత్వ నేతలు అర్రులు చాస్తున్నారు. నాడు నిర్మాణ పనుల ఆధారంగా అధికార పార్టీ నేతలు ఆదాయం ఆశిస్తే.. నేడు ఆర్టీపీపీ నుంచి వెలువడే ఫ్లైయాష్ ద్వారా సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి రోజు ఆర్టీపీపీ రన్నింగ్ యూనిట్ల నుంచి ఈఎస్‌పీ ఆఫర్స్ ద్వారా సైనోస్ నుంచి ఫ్లైయాష్ రిలీజ్ చేస్తారు. కాగా, సైనోస్‌లో ప్రాబ్లమ్స్ తలెత్తితే, ఈఎస్‌పీ ఆఫర్స్ ఓపెన్ చేసి ఫ్లైయాష్ రిలీజ్ చేస్తారు. ఈఎస్‌పీ ద్వారా రిలీజ్ అయిన గ్రౌండ్ ఫ్లైయాష్ క్లియర్ చేసేందుకు టన్నుకు రూ.60 చొప్పున ఆర్టీపీపీ చెల్లిస్తోంది. అక్కడ నుంచి సదరు కాంట్రాక్టర్ ఫ్లైయాష్ క్లియర్ చేయాలి. అయితే సైనోస్ ద్వారా డైలీ 2 వేల టన్నులు ఫ్లైయాష్ రిలీజ్ అవుతోంది. ఎంఓయూ మేరకు టన్ను రూ.546తో నేరుగా ట్రక్కులు, ట్యాంకర్ల ద్వారా బల్కర్స్ వే బ్రిడ్జి దగ్గరకు వెళ్లి పేమెంట్ చేసేవారు. ఇప్పుడు ఆ వ్యవహారాన్ని అధికార పార్టీ నేతలు పూర్తిగా మరుగు పర్చారు. ఈఎస్‌పీ ఆఫర్స్ ద్వారా ఫ్లైయాష్ దోపిడీ చేస్తున్నారు.

అధికారుల సహకారంతో జెన్‌కో ఖజానాకు చిల్లు

ఫ్లైయాష్‌తో నింపిన ట్యాంకర్లు వేబ్రిడ్జి కాటా వేసిన తర్వాత ఇన్‌వాయిస్, జీఎస్‌టీ బిల్లు జనరేట్ చేయాల్సి ఉంది. టన్ను రూ.546తో ట్రేడర్స్‌కు బిల్లు చేయాల్సి ఉంది. కాగా ప్రతి రోజు ఈఎస్‌పీ ఆఫర్స్ ద్వారా ఫ్లైయాష్‌ను రిలీజ్ చేస్తున్నారు. ఆ ఫ్లైయాష్ నేరుగా ఓ ట్యాంకర్‌లో పడేలా ఫిక్స్ చేశారు. సదరు ట్యాంకర్‌కు కంప్రెషర్ ద్వారా ఎయిర్ పైపు ఫిట్ చేసి దాని ద్వారా బల్కర్లకు లోడ్ చేస్తున్నారు. మరోవైపు బల్కర్లు అధికంగా వస్తే నేరుగా ఈఎస్‌పీ ఆఫర్స్‌కు మిషన్ ఫిట్ చేసి లోడింగ్ చేస్తున్నారు. ఇదంతా అనధికారికంగా నడుస్తోంది. కేజీఎఫ్ సినిమాలో లాగా ఫ్లైయాష్‌ను కొల్లగొట్టుతున్నారు. ప్రతి రోజు ఇలా 4 నుంచి 6 ట్యాంకర్లు అక్రమంగా తరలుతున్నాయి. ఒక్కొక్క ట్యాంకర్‌కు 50 నుంచి 70 టన్నులు లోడింగ్ చేస్తున్నారు. సరాసరిగా ఒక్కొక్క ట్యాంకర్ ద్వారా రూ.35 వేల అక్రమార్జన లభిస్తోంది. ఈ ట్యాంకర్లన్నీ 600 మెగావాట్స్ గేటు నుంచి ఇన్ అవుట్ అవుతోన్నాయి. వీటికి వేబిల్స్ ఉండవు, జీఎస్‌టీ బిల్లులు ఉండవు. ప్రైవేటు వేబ్రిడ్జి వద్ద కాటా వేయించుకొని సిమెంటు పరిశ్రమలకు సరఫరా చేస్తున్నారు. కాటా ఆధారంగా సిమెంటు కంపెనీలు బిల్లులు జనరేట్ చేస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారం జెన్‌కో అధికారుల సహకారంతోనే అధికార పార్టీ నేతలు తరలిస్తోన్నట్లు సమాచారం. ప్రతి రోజు దాదాపు రూ.2 లక్షలు తెలిసి అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తుంటే 'కళ్లుండీ చూడలేని కబోదిలా' వ్యవహరిస్తున్నారు.



ట్యాంకర్‌కు అనధికారికంగా నింపుతున్న ఫ్లైయాష్

ఫ్లైయాష్ కోసం యుద్ధభేరీ

ఫ్లైయాష్‌ను సిమెంటు పరిశ్రమలకు తామే తరలించాలని కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేల మధ్య భీకర యుద్ధమే చోటుచేసుకుంది. పోలీసుల ప్రొటెక్షన్ ఏర్పాటు చేయించి తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి వాహనాలకు ఫ్లైయాష్ కేటాయించకుండా.. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రైవేటుగా తన మనుషులను పెట్టి అడ్డకున్న ఈ వ్యవహారం పాఠకులకు తెలిసిందే. సీఎంఓ స్థాయిలో జోక్యం చేసుకొని ఎంఓయూ మేరకు ఆయా ట్రేడర్స్‌కు ఫ్లైయాష్ కేటాయించేలా ఆదేశించారు. కాగా, ఫ్లైయాష్ ఫాండ్‌కు చేరకుండానే మధ్యలో ఈఎస్‌పీ ఆఫర్స్ ద్వారా కొల్లగొట్టుతున్న చరిత్ర తాజాగా ఆర్టీపీపీలో ఉత్పన్నం కావడం గమనార్హం. ఈ విషయమై పలువురు జెన్‌కో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా నిష్ప్రయోజనమే అయ్యిందని పలువురు వివరిస్తున్నారు.



ఈఎస్‌పీ ద్వారా ట్యాంకర్‌లో ఫ్లైయాష్ పడేలా ఫిక్స్ చేసిన దృశ్యం

పేద విద్యార్థులకు సిద్ధంగా
మహా గురుకులం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని పేద విద్యార్థులకు అధునాతన వసతులతో నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర మహా గురుకులం విద్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బి.మఠం మండలంలో నూతనంగా ఏర్పాటైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహా గురుకులం (బాలుర) విద్యాలయంలో పెండింగ్ పనులు, వసతులు, విద్యార్థుల అడ్మిషన్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి గాను 460 మంది విద్యార్థులతో అడ్మిషన్లను 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జిల్లా కో ఆర్డినేటర్ ఉదయశ్రీ, డీఈవో షంషుద్దీన్, ఎస్ఎస్ఏ ఏపీసీ ఎ.రామలింగరాజు, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, జోయల్ విజయ్ కుమార్, కాంట్రాక్టు ఏజెన్సీ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లాలో పెండింగ్‌లో వున్న అన్ని రకాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ అన్ని శాఖల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో డీఎంఎఫ్ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్) ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి నిర్మాణ పనుల పురోగతిపై ఆయా శాఖల ఇంజినీరింగ్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో చేపట్టిన అన్ని రకాల నిర్మాణాల్లో నాణ్యతలో రాజీ పడొద్దని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఓ హజరతయ్య, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, గనులు భూగర్భ శాఖ డీడీ వెంకట సాయి, హౌసింగ్ పీడీ రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

21న 'యోగాంధ్ర'ను విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా.. ఈ నెల 21న జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సభా భవన్‌లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి, వారిని చైతన్యం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ విశ్వేశ్వర్ నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల్లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలకు కలెక్టర్ శ్రీధర్ హెచ్చరికలు జారీ చేశారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ విభాగం కింద కడప జిల్లా వ్యాప్తంగా 10 నెట్‌వర్క్ హాస్పిటల్స్ పైన 18 మంది పేషంట్లు ఐవీఆర్ ద్వారా అందించిన ఫిర్యాదుల మేరకు కమిటీ విచారణ చేపట్టింది. అందిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత వైద్యులు, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు, డీసీహెచ్ఎస్ హిమదేవి, సంబంధిత వైద్య అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మహిళలకు భద్రత కరువైందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విమర్శించారు. పులివెందులలోని తన స్వగృహం వద్ద ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యం ఏదోక చోట మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోయాయన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో కూడా మహిళపై దాడి జరగడం దారుణమన్నారు. రాష్ట్ర హోం మంత్రిగా ఒక మహిళ ఉండి కూడా మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టలేకపోవడం సిగ్గుచేటు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో మహిళల రక్షణ కోసం దిశ యాప్‌ను ఏర్పాటు చేసి అండగా నిలవడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి పైన, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధించడం తప్ప చేసిందేమీ లేదన్నారు. తల్లికి వందనం పథకాన్ని అమలు చేశామని గొప్పగా చెప్పుకుంటున్న టీడీపీ నేతలు అనేక కొర్రీలు పెట్టి ఎగ్గొట్టడం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మంది లబ్ధిదారులకు ఈ పథకం అందలేదన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని తమకు ఇష్టం వచ్చిన రీతిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులపైన అక్రమ కేసులు బనాయించడం జరుగుతోందన్నారు. కొన్ని చోట్ల వీరి వేధింపులు తాళలేక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. అటువంటి కుటుంబాల వారికి మనోధైర్యం నింపడానికి తమ పార్టీ అధినేత ఆ కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళుతుంటే.. దాన్ని కూడా ఆంక్షల పేరుతో ఈ ప్రభుత్వం అడ్డుకోవాలని చూడటం వారి నీచత్వానికి పరాకాష్టగా ఉందన్నారు. ఇటీవల పొదిలి పర్యటన సందర్భంగా తమ నాయకుడు వైఎస్ జగనన్నకు వచ్చిన ప్రజాదరణ చూసి ఓర్వలేక ఈ ప్రభుత్వం ఇలాంటి కుటిల ప్రయత్నాలు చేస్తోందన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని రాబోయే రోజులలో ప్రజలు వారికి తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

అధికార పార్టీ నేతలా.. మజాకా..

- వక్ఫ్‌బోర్డు స్థలం ఆక్రమణను తొలగించేందుకు వచ్చి వెనక్కి వెళ్లిన అధికారులు
- డీఆర్‌ఓ ఆదేశాలు ఇచ్చినా పరిష్కారం కాని సమస్య



వక్ఫ్‌బోర్డు స్థలంలో నిర్మిస్తున్న కారు పార్కింగ్



వక్ఫ్‌బోర్డు స్థలంలో నిర్మించిన ఛాయ్ సెంటర్

ప్రొద్దుటూరు: వక్ఫ్‌బోర్డుకు సంబంధించి ఆక్రమణలను తొలగించేందుకు వచ్చిన అధికారులు.. అధికార పార్టీ నేతల దెబ్బకు వెనక్కి వెళ్లిన సంఘటన మంగళవారం ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. మళ్లీ ఏం జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది. మోడంమీదపల్లె గ్రామ పొలం సర్వే నంబర్ 278/1లో అధికార పార్టీ నేత నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని తొలగించాలని స్వయంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వనాథ నాయుడు ఆదేశించినా.. ఫలితం లేకుండా పోయింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక డీసీఎస్ఆర్ కాలనీ వెనుక, సినీ హబ్ బైపాస్ రోడ్డు మధ్యన 11 సెంట్ల విస్తీర్ణంలో బొల్లవరానికి చెందిన అధికార పార్టీ నేత కారు పార్కింగ్ కోసం నిర్మాణ పనులు చేపట్టాడు. గత కొద్ది రోజులుగా ఈ పనులు జరుగుతున్నాయి. వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం చాలా రోజులుగా పోరాటం చేస్తున్న షేక్ మాబు షరీఫ్ ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు డీఆర్‌ఓ ఈ అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని ప్రొద్దుటూరు తహసీల్దార్, కొత్తపల్లె గ్రామ పంచాయతీ సెక్రటరీ, టూటౌన్ ఎస్ఐలను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వక్ఫ్‌బోర్డు ఆఫీసర్ వశీం, మండల సర్వేయర్ వెంకటలక్ష్మి మంగళవారం మరోమారు సర్వే నిర్వహించారు. ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించినా అధికార పార్టీ నేతలు అడ్డుపడటంతో చివరికి అధికారులు వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫిర్యాదుదారుడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా బెదిరింపులు వచ్చాయి. సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి రాకుండా కేవలం తమ సిబ్బందిని మాత్రమే తప్పించి తప్పుకొన్నారు. సంఘటన స్థలంలో సర్వేయర్‌లు సుధాకర్, రాఘవ, వీఆర్‌ఓ రవి, కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి వరికూటి రామమోహన్‌రెడ్డి ఉన్నారు.

ఎకరా రెండు సెంట్ల స్థలం కబ్జా

కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని మోడంమీదపల్లె గ్రామ పొలం సర్వే నంబర్ 278/1లో మొత్తం 1.02 ఎకరాల వక్ఫ్‌బోర్డు స్థలం ఉంది. ఈ స్థలం విలువ ప్రస్తుతం సుమారు రూ.15 కోట్లు ఉంటుంది. 1943 జూన్ 17న మోడంమీదపల్లె మసీదుకు సంబంధించిన కమిటీ సభ్యులు ఈ స్థలాన్ని కొనుగోలు చేశారు. పోతుల పాపయ్య కుమారుడు సుబ్బయ్య ఈ స్థలాన్ని అప్పట్లో విక్రయించిన రికార్డులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్నాయి. గెజిట్‌లో ఈ వివరాలను పొందుపరిచారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఒక్కొక్కటిగా వక్ఫ్‌బోర్డు స్థలాలు ప్రొద్దుటూరులో కబ్జాకు గురవుతున్నాయి. ఇందులో భాగంగానే ఎకరా రెండు సెంట్ల స్థలాన్ని కూడా ఆక్రమించారు. ఈ స్థలంలోని 33 సెంట్లలో గతంలో ఆరుగురు శాశ్వత గృహాలను నిర్మించారు. గతంలోనే అధికారులు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. ఇది ఇలా ఉండగానే ప్రస్తుతం 10 సెంట్ల స్థలంలో ఛాయ్ సెంటర్, మరో 10 స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టగా, కొత్తగా 11 సెంట్ల స్థలంలో కారు పార్కింగ్ పనులను ప్రారంభించారు. సమస్య తీవ్రత ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో డీఆర్‌ఓ ఆదేశాల మేరకు తొలగించేందుకు వచ్చి అధికార పార్టీ నేతల దెబ్బకు వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది.

బాబోయ్.. ఇదేం తల్లికి వందనం

కూటమి ప్రభుత్వం ఎన్నో కొర్రీల తర్వాత అమలు చేసిన తల్లికి వందనం పథకాన్ని.. అందుకోవడానికి ప్రజలు ముప్పుతిప్పలు పడాల్సి వస్తోంది. కొందరి తల్లుల బ్యాంక్ ఖాతాలకు కాకుండా.. ఆధార్‌కు అనుసంధానం అయిన పోస్టల్ ఖాతాలకు నగదు జమ అయింది. డ్రా చేసుకునేందుకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. కడపలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం వద్ద మంగళవారం ప్రజలు బారులు తీరి కనిపించారు. ఉదయం 7 గంటల నుంచే దాదాపు కిలోమీటరు మేర బారులు తీరారు. చిన్న పిల్లలను తీసుకొచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. తాగునీరు, భోజనం లేక ఆకలితో అలమటించారు. కార్యాలయం నుంచి ప్రధాన రహదారి పైకి క్యూ ఉండటంతో.. తోపులాట జరగకుండా ఉండేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. పోస్టల్ అధికారులు ప్రజల క్యూకు తగ్గటుగా కౌంటర్లను ఏర్పాటు చేయకుండా.. ఉన్న రెండు కౌంటర్లతోనే కార్యకలాపాలు సాగించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
– కడప వైఎస్ఆర్ సర్కిల్



అలసి.. సొలసి..



మహిళలకు పోస్టల్ సేవలు అందిస్తున్న సిబ్బంది



పోస్టల్ ప్రధాన కార్యాలయం వద్ద బారులు దీరిన లబ్ధిదారులు

క్లుప్తంగా

ఇప్పట్లలో అగ్ని ప్రమాదం



కాలిపోయిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు

లింగాల : లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో యుగంధర్‌రెడ్డి అనే రైతుకు చెందిన డ్రిప్ ఇరిగేషన్ పైపులు, లాడర్ పూర్తిగా కాలిపోయాయి. దీంతో సుమారు రూ.4లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధిత రైతు తెలిపారు. వివరాలలోకి వెళితే.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు కాలిపోయి అగ్గిరవ్వలు ఎండు గడ్డిపై పడటంతో మంటలు బీడు పొలంలోకి ప్రవేశించడంతో పొలం గట్టున ఉంచిన పైపులు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. సబ్సిడీ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు పొందిన రైతుకు అగ్ని ప్రమాదం వల్ల నష్టం సంభవించిందని, దీంతో తిరిగి ఆయనకు సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

వృద్ధుడు అదృశ్యం



బాణ చిన్న నారాయణరెడ్డి (ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణ పరిధికి చెందిన బాణ చిన్న నారాయణరెడ్డి (75) అనే వృద్ధుడు కనిపించడం లేదని కుటుంబీకులు మంగళవారం పట్టణ ఎస్ఐ హైమవతికి ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన బాణ చిన్న నారాయణరెడ్డి రోజు మాదిరిగా బయటకు వెళ్లి తిరిగి వచ్చేవాడు. కాగా సోమవారం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఉన్న మృతదేహం

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గుర్తు తెలియని (30–35 ఏళ్లు) వ్యక్తి మృతి చెందాడు. ఆస్పత్రిలోని భవనాలకు వెనుక భాగాన గోడకు ఆనుకొని మృతదేహం కనిపించింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి ముఖంపై గాయాలు ఉండటంతో ఎవరైనా హత్య చేసి ఉంటారనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఈ మృతదేహంపై స్పష్టత రానందున మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతుడి కోసం ఎవరూ రానందున అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ బివి చలపతి తెలిపారు.

సమస్యల వలయంలో కడప 'రిమ్స్'

- ఓపీ, ఐపీ విభాగాలలో రోగులకు తప్పని తిప్పలు
- దివ్యాంగుల సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌లో దళారుల దందా
- సూపర్, క్యాన్సర్, మానసిక హాస్పిటల్స్‌లలో పోస్టుల భర్తీ జరిగేనా..?
- డాక్టర్ల, సిబ్బంది పనితీరు పై పర్యవేక్షణ లోపం
- సమయపాలన పాటించని కొందరు వైద్యులు, సిబ్బంది



కడప రిమ్స్‌లోని ఓపీ విభాగం

కడప అర్బన్ : కడప రిమ్స్ సమస్యల వలయంలో చిక్కుకుంది. ఓపీ, ఐపీ విభాగాలలో రోగులు పలురకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వైద్యులు ఆయా విభాగాలలో చిత్తశుద్ధితో విధులను నిర్వహిస్తూ వుంటే, కొన్ని విభాగాలలో మాత్రం కేవలం ఎఫ్ఆర్ఎస్, అటెండెన్స్ రిజిష్టర్‌లలో సంతకాలను పెట్టి మరీ తమ సొంత క్లినిక్‌లను పయనమవుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొన్ని ఓపీ విభాగాలలో హౌస్ సర్జన్‌లు, పీజీ విద్యార్థులచే వైద్య పరీక్షలను చేయించి పంపించేస్తున్నారు.

ఎక్స్‌రేలు, ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్ రిపోర్ట్‌లను ఎప్పటికపుడు ఇస్తే ఆయా డాక్టర్‌లను సంప్రదించి తగిన వైద్య సేవలను పొందే అవకాశాలున్నాయి. ఫిల్మ్‌ల కొరతతో ఆయా విభాగాల డాక్టర్‌లకు ఎక్స్‌రే రిపోర్ట్‌లను వారి సెల్‌ఫోన్‌లకు ఆన్‌లైన్ ద్వారా పంపించేస్తున్నామంటూ రోగులకు తెలియజేస్తున్నారు. మరి డాక్టర్ అందుబాటులో వుంటే సరైన వైద్య సహాయంను అందించే అవకాశం వుంటుంది. కానీ సదరు డాక్టర్ తమ పరిధిలోని పీజీ డాక్టర్‌కుగానీ, హౌస్ సర్జన్‌కుగానీ సదరు ఫిల్మ్‌ను లేదా రిపోర్ట్‌ను పంపించి వైద్య సహాయం చేయమని కోరతారు. ఈ విధానం ఓపీలోనూ, ఐపీలోని కొన్ని విభాగాలలో తూ.చా.తప్పక జరుగుతోంది. ప్రస్తుత డాక్టర్‌లలో చాలా మంది రోగులతో మాట్లాడే విధానంకు చాలా వరకు స్వస్తి పలికారు. ఆప్యాయంగా రోగులతో మాట్లాడి వారికి భరోసాను ఇస్తూ, వారి వ్యాధి నివారణకు తమవంతుగా కృషి చేద్దామనే ఆలోచన సన్నగిల్లింది.

సమయపాలనేదీ..?

డాక్టర్లు ఓపీ, ఐపీ విభాగాలలో సమయపాలన పాటించడంలోనూ తీవ్రంగా విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఉదయం 9 గంటలకు ఓపీకి రావాల్సిన డాక్టర్‌లలో కొందరు 10గంటలకుగానీ, 10:30 గంటలకుగానీ వస్తున్నారు. వచ్చిన వారు ఓపికగా వైద్య సేవలను అందించాల్సిందిపోయి హౌస్‌సర్జన్‌లకు, పీజీలకు వదిలేసి తమవంతుగా సెల్‌ఫోన్‌లకుగానీ, ఇతరత్రా పనులలో నిమగ్నమైపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఓపీ వైద్యసేవలను అందిస్తున్న డాక్టర్లందరినీ ప్రజలు హర్షిస్తున్నారు. కొందరు మాత్రం ఈ వేళల్లో తమ విధులకు డుమ్మాకొట్టి కడప నగరంలో తాము నిర్మించుకున్న హాస్పిటల్స్‌లో వైద్యసేవలను అందించేందుకు వెళుతున్న వైద్యులను మాత్రం ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నప్పటికీ వారిలో మార్పులేదనీ, మంత్రి అయినా తమ సమీక్షలో ఓపీ, ఐపీ సేవల విధానాన్ని ఖచ్చితంగా సమయపాలనను అమలు చేస్తారని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

దళారుల చేతివాటం..

దివ్యాంగుల సర్టిఫికెట్‌లను నిక్కచ్చిగా రీ వెరిఫికేషన్ చేసి అర్హులైన దివ్యాంగులకే ప్రభుత్వ పథకాలను వర్తింపచేయాలని కూటమి ప్రభుత్వం ప్రతి ఆసుపత్రిలో 'రీ వెరిఫికేషన్' ను ప్రారంభించి, కొనసాగిస్తున్నారు. మంచానికే పరిమితమైన, చేతులు, కాళ్లు పనిచేయక తమ కుటుంబసభ్యుల, బంధువుల మీద ఆధారపడి జీవించే వారిని కూడా రీ వెరిఫికేషన్‌కు పిలిపించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. దీనికితోడుగా దళారుల బెడద కూడా ఎక్కువైంది. జిల్లావ్యాప్తంగా, కడప రిమ్స్‌లో కొందరు చిరుద్యోగులతోపాటుగా, పరిపాలనా విభాగంలోని ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లు, కొందరు అటెండర్లు తాము కొందరు డాక్టర్లతో మాట్లాడుకుని రూ. 15 వేల నుంచి రూ. 25 వేల వరకు అక్రమంగా వసూలు చేసి రీ వెరిఫికేషన్‌ను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఓపీ, ఐపీ విభాగాలలో వైద్య సేవల కోసం వచ్చేవారి సంఖ్య కూడా రోజురోజుకు సన్నగిల్లుతోందని చెప్పుకోవచ్చు. ఓపీకి సరాసరి రోజూ 1600 నుంచి 1800 వరకు వచ్చే వారు సోమ, మంగళ, బుధవారాలలో ఎక్కువగా వస్తున్నారు. గురు, శుక్ర, శనివారాలలో తగ్గుతున్నారు.

నాడు వైఎస్ఆర్ ఉన్నతాశయం..

దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రిమ్స్ ఏర్పాటుచేశారు. నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో నడిపించారు. ఆ తర్వాత ఆయన కుమారుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా సీఎం అయిన ఏడాదిలోనే కడప రిమ్స్ ఆవరణలో మూడు వివిధ ప్రదేశాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మానసిక వైద్యుల ఆసుపత్రికి, కేన్సర్ హాస్పిటల్‌కు శంకుస్థాపన నిర్వహించడంతో పాటు తమ పరిపాలన ముగిసేలోపే ఆయా హాస్పిటల్స్‌లలో నిర్మాణ పనులను పూర్తి చేసేలా కృషి చేశారు. 2023 డిసెంబర్‌లో రూ. 322 కోట్ల వ్యయంతో నిర్మించిన 452 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను, 100 పడకల కేన్సర్ హాస్పిటల్, 100 పడకల మానసిక వైకల్య నివారణ హాస్పిటల్ (ఐ.ఎం.హెచ్)ల భవన నిర్మాణాలను పూర్తి చేసి రిమ్స్ ఆవరణంలో ప్రత్యేక హాస్పిటల్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చారు. పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్‌ను ఇచ్చి అధికారులచే ప్రక్రియను ప్రారంభించారు. ఆ ప్రక్రియ పూర్తి కాకమునుపే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో నిలిచిపోయాయి. తాజాగా ఇటీవల సూపర్ స్పెషాలిటీలో 69 కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో వివిధ రకాల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను ఇచ్చారు. కానీ ఆ పోస్టులైనా తమకు న్యాయబద్ధంగా భర్తీ జరుగుతాయా? లేదా అని నిరుద్యోగ అభ్యర్థులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. మిగతా రెండు హాస్పిటల్స్‌లలో కూడా పోస్టుల భర్తీకి ప్రస్తుత కూటమి ప్రభుత్వం కృషి చేయాలని ఉద్యోగార్థులు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.



ఓపీ విభాగం ముందు వేచివున్న దివ్యాంగులు, వారి బంధువులు



దివ్యాంగురాలిని ఓపీలోకి తీసుకుని వెళుతున్న బంధువులు

మట్కా బీటర్లు అరెస్ట్

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలోని అలంకార్ సినిమా హాలు వద్ద 5 మంది మట్కా బీటర్లను అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి మట్కా పట్టీలు, రూ. 1,39,000 స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ హైమావతి మంగళవారం తెలిపారు. పట్టణంలోని అలంకార్ సినిమా హాల్ వద్ద మట్కా బీటర్లు ఉన్నట్లు ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో షేక్ గౌస్ ఖలందర్‌తో పాటు మరో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆంధ్రసౌత్ జోన్ క్రికెట్ జట్టుకు నందలూరు బాలిక



పూర్విజ

నందలూరు : ఆంధ్ర సౌత్ జోన్ క్రికెట్ జట్టుకు నందలూరు విభా ఏరుడైట్ స్కూల్‌కు చెందిన హనుమంతు పూర్విజా ఎంపికైనట్లు క్రికెట్ సబ్ సెంటర్ కోచ్‌లు గయాజ్, ఫైరోజ్‌ఖాన్ లోడీలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ పూర్విజ స్థానిక సబ్‌సెంటర్లో ఫాస్ట్ బౌలింగ్‌లో శిక్షణ పొందుతూ మంచి క్రమశిక్షణతో శ్రమించి ప్రాక్టీస్ చేస్తూ జిల్లా జట్టుకు ఎంపిక అయిందన్నారు. తన ఫాస్ట్ బౌలింగ్‌తో నెల్లూరు జిల్లాలో జరిగిన జిల్లా క్రికెట్ మ్యాచ్‌లలో నెల్లూరు, అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లలో అన్ని జిల్లాల మీద మంచి వికెట్లు సాధించి అండర్ –15 విభాగంలో ఆంధ్రా సౌత్ జోన్ జట్టుకు ఎంపిక అయిందన్నారు.

వివాహిత ఆత్మహత్య

మదనపల్లె రూరల్ : వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం రామసముద్రం మండలంలో జరిగింది. కాప్పల్లె చెందిన సంతోష్ కు ఏడేళ్ల క్రితం కర్ణాటకకు చెందిన అహల్య (27) తో వివాహం జరిగింది. వీరికి రోహన్ సాయి, రుషి ఇద్దరు కుమారులు ఉన్నారు. సంతోష్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గత కొంతకాలంగా అహల్య వేరు కాపురం పెట్టాలని భర్తతో తరచూ గొడవపడుతుండేది. మంగళవారం ఇదే విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన అహల్య పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది.

ప్రారంభమైన బదిలీల కౌన్సెలింగ్

- వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో
- ఉత్కంఠ రేపుతున్న ట్రాన్స్‌ఫర్స్



జూమ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలను చేపడుపతున్న ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్య, ఇతర అధికారులు

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో ఉద్యోగుల బదిలీల జూమ్ కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. ఈ ప్రక్రియ ఈ నెల 19వ తేదీ వరకు జరగనుంది. కౌన్సెలింగ్‌ను ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య, విజయవాడ నుంచి వచ్చిన పరిశీలకులు రామ్‌నాథం, భిక్షాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటసుబ్బమ్మ, జూనియర్ అసిస్టెంట్స్ వనీష, బత్తినయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతటా ఆసక్తి..

ఈ శాఖ పరిధిలో రాయలసీమ జిల్లాలు ఉద్యోగులు వస్తారు. వివిధ కేడర్‌లకు సంబంధించి నిబంధనల ప్రకారం వేలాది మంది ఉద్యోగులను బదిలీ చేయాలి. ఈ సందర్భంగా పలువురు పలుకుబడి..పరపతి ఉన్న ఉద్యోగులు ఉన్నచోటే ఉండడానికి పాకులాడారు. మరికొందరు ఆశించిన సీటు కోసం పోరాటం చేశారు. ఈ నేపథ్యంలో కొందరికి అనూహ్యంగా నిరాశ ఎదురైంది. ఈ పరిణామాలు ఆ శాఖ ఉద్యోగుల్లో ఉత్కంఠ రేపాయి. మొదటి రోజు కౌన్సెలింగ్‌లో కీలకమైన ఆఫీస్ సూపరింటెండెంట్ స్థానం కోసం కొందరు తీవ్ర ప్రయత్నాలు చేసినట్లుగా వినికిడి. అలాగే హెల్త్ ఎడ్యుకేటర్‌కు సంబంధించి బది'లీలలు' జరిగినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకా రెండు రోజుల పాటు జరిగే కౌన్సెలింగ్‌పై అందరూ దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం బదిలీలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థిని మృతి

మదనపల్లె రూరల్ : ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యం పాలై చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో జరిగింది. ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీ పాతకోటకు చెందిన జమాల్ కుమార్తె తజ్విన్ తాజ్(12) స్థానికంగా ఏడో తరగతి చదువుతోంది. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చిన తర్వాత ఉదయం వండిన ఆహారాన్ని తింది. తర్వాత రాత్రి తజ్విన్ తాజ్‌కు వాంతులు కావడంతో అనారోగ్యానికి గురైంది. గమనించిన కుటుంబసభ్యులు ఆ విద్యార్థిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి అర్ధరాత్రి సమయంలో తీసుకువచ్చారు. అత్యవసర విభాగంలో చికిత్స చేసి ఐసీయూ విభాగానికి తరలించి చికిత్స అందించారు. మంగళవారం ఉదయం పరిస్థితి విషమించి విద్యార్థిని మృతి చెందింది. దీంతో మృతదేహాన్ని మార్చురీ గదికి తరలించి ములకలచెరువు పోలీసులకు అవుట్‌పోస్ట్ సిబ్బంది సమాచారం అందించారు.

ఫీజుల దోపిడీని అరికట్టండి

సుండుపల్లె : కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు నాగేంద్రనాయక్ చౌహాన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్ల పేరుతో దోపిడీకి గురి చేస్తున్నాయని, అధిక ఫీజులు వసూలు చేసి పేద ప్రజల కడుపు కొడుతున్నారని అన్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విద్యాశాఖ అధికారులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల పైన విచారణ చేపట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఒంటరి మహిళను చెట్టుకు కట్టేసి కొట్టడం అనాగరికం

- కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైంది
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ

కడప కార్పొరేషన్ : చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో తన పిల్లలతో ఒంటరిగా జీవిస్తున్న మహిళను చెట్టుకు కట్టేసి కొట్టడం అనాగరికమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, నగర అధ్యక్షురాలు బండి దీప్తి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ఈ ఘటన జరగడం దారుణమన్నారు. తన భర్త అప్పులు చేసి పారిపోతే కూలి పనులు చేసుకుంటూ ఆ మహిళ కొద్ది కొద్దిగా అప్పు చెల్లిస్తోందని, అయినా వినకుండా మునికన్నప్ప అనే వ్యక్తి ఆమెను జుట్టు పట్టుకొని ఈడ్చుకుంటూ వెళ్లి ఆమెను చెట్టుకు కట్టేసి కొట్టడం అమానవీయమన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రిగానీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రిగానీ స్పందించకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలపై ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట హింస జరుగుతూనే ఉందన్నారు. జమ్మలమడుగులోని మైలవరంలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేస్తే ప్రజలే చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని నిందితుని ఇంటిని కూల్చివేశారన్నారు. ఈ ప్రభుత్వంలో పోలీస్ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో చెప్పడానికి ఇది నిదర్శనమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనకు భద్రత కల్పించలేమని ఒక ఎస్పీ ప్రెస్‌మీట్ పెట్టి విమర్శలు చేయడం దారుణమన్నారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేనికి బెయిల్ వస్తే దానిపై మాట్లాడిన హోం మంత్రి, ఇలాంటి ఘటనలపై నోరు మెదపడం లేదని ఎద్దేవా చేశారు. కుప్పంలో దాడికి గురైన మహిళకు ప్రభుత్వం న్యాయం చేయాలని, లేనిపక్షంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, ఉమామహేశ్వరి, రత్నకుమారి, బి. మరియలు, నారాయణమ్మ, సుశీలమ్మ, తులశమ్మ, చైతల్య, మల్లీశ్వరి, పద్మ పాల్గొన్నారు.

రియల్టర్ హత్యకేసులో దర్యాప్తు ముమ్మరం

మదనపల్లె రూరల్ : పట్టణంలో సంచలనం సృష్టించిన రియల్టర్ గంగాధర హత్యకేసులో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. డీఎస్పీ మహేంద్ర ఆదేశాల మేరకు తాలూకా సీఐ కళావెంకటరమణ, దర్యాప్తు బృందం హత్యకు సంబంధించి సాంకేతికత ఆధారాలు, సీసీ టీవీ ఫుటేజీ సేకరణ, బంధువులను విచారించడం చేశారు. మంగళవారం హత్యకేసుకు సంబంధించి మరో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న గంగాధర భార్య వనితను పూర్తిస్థాయిలో విచారించారు. హత్యకు గల కారణా లు, దారి తీసిన పరిస్థితులు, అనుమానితుల కాల్‌డేటాను విశ్లేషించారు. ముఖ్యంగా గంగాధర రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారాల్లో ఇతరులతో జరిపిన లావాదేవీలపై క్షుణ్ణంగా విచారిస్తున్నారు. గంగాధర ఇదివరకే తండ్రి హత్యకేసులో ప్రధాన నిందితుడు కావ డం ఓ వైపు, నగదు లావాదేవీలను అడ్డుపెట్టుకుని వివాహేతర సంబంధాలకు పాల్పడటం, భార్యతో అతడి వ్యవహారశైలి విచారణలో కీలకంగా మారాయి.

పీఎం ఆవాస్ యోజన కింద గృహాలు మంజూరు

- అర్బన్ ప్రాంతాల్లో 2,700 ఇళ్లు
- మౌలిక సదుపాయాలకు రూ.7 కోట్ల కేటాయింపునకు ప్రతిపాదనలు
- హౌసింగ్ పీడీ వి.రాజరత్నం



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రాజరత్నం

కడప సెవెన్‌రోడ్స్ : ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద గృహాలు మంజూరు చేస్తున్నామని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.రాజరత్నం తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2025 సంవత్సరానికి సంబంధించి గృహాల మంజూరుకు ఆన్‌లైన్ ఎంట్రీ జరుగుతోందన్నారు. అర్బన్ ప్రాంతాల్లో కనీసం 750 చదరపు అడుగుల విస్తీర్ణం గల స్థలం ఉన్న పేదలు ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం లాగిన్ ప్రొవైడ్ చేశామన్నారు. ఇప్పటికే జిల్లాలోని అర్బన్ ప్రాంతాల నుంచి 2700 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరికి గృహాలు మంజూరు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలోనే వీరికి గృహాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఇందులో కేంద్ర వాటా రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.లక్ష ఉంటుందన్నారు. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు మంజూరు చేస్తుందని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు గృహాల మంజూరుకు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా లాగిన్స్ ఇంకా ప్రొవైడ్ చేయాల్సి ఉందని తెలిపారు.

ఇంటి మంజూరుకు అవసరమైన పత్రాలు

ఇల్లు మంజూరు కోసం దరఖాస్తు చేసుకునే వారు భార్యాభర్తల ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు వివరాలు, కులం, ఆదాయ సర్టిఫికెట్లు, ఇంటి స్థలం కొనుగోలుకు సంబంధించిన దస్తావేజులు లేదా పొసెషన్ సర్టిఫికెట్లు లేదా డి.పట్టా సమర్పించాల్సి ఉంటుందన్నారు.

14వ స్థానంలో జిల్లా

గృహ నిర్మాణంలో ఇప్పటి దాకా 26వ స్థానంలో ఉన్న జిల్లా 14వ స్థానంలోకి వచ్చిందని పేర్కొన్నారు. పీఎం ఆవాస్ యోజన 1.0 కింద 2019–24 వరకు జిల్లాలో 99,475 గృహ నిర్మాణాలు చేపట్టామన్నారు. ఇందులో 48,016 (49 శాతం) నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. బేస్‌మెంట్ లెవెల్‌లో 30 వేలు, రూ.రూఫ్‌లెవెల్‌లో 10 వేలు, ఆర్‌సీ లెవెల్‌లో 10 వేలు ఉన్నాయన్నారు. ఈనెలాఖరుకు 10,821 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలన్నది లక్ష్యం కాగా, 5000 నిర్మాణాలు మాత్రం పూర్తి చేయగలిగామన్నారు. ఇప్పటికే చేపట్టిన కాలనీల్లో నీరు, రోడ్లు, పైపులైన్ కనెక్షన్లు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంటు చెల్లించాల్సిన రూ.7 కోట్లు పెండింగ్‌లో ఉందన్నారు. ఆ నిధులు మంజూరు చేయాలంటూ రాష్ట్ర ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. నిధులు విడుదలైన వెంటనే మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడతామన్నారు. చాలా కాలనీల్లో వీధి లైట్లు వేయించామని, ఇంకా చాలా చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉందని వివరించారు. అవసరమైన ప్రజలు గృహ నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

మలుగుడుపాడులో భూఆక్రమణల జోరు



డీ పట్టాలు పొందిన భూములలో దోజర్‌తో చదును చేస్తున్న దృశ్యం



ఆక్రమణదారులు వేసిన వ్యవసాయ బోరు

- అధికార పార్టీ అండతో నిరుపేదలకు ఇచ్చిన భూముల ఆక్రమణ
- దివంగత వైఎస్సార్ ప్రభుత్వంలో నిరుపేదలకు పట్టాలు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని డి.నేలటూరు పంచాయతీ మలుగుడు పాడు గ్రామ సమీపంలో సర్వేనెంబర్ 571లో వందలాది ఎకరాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇందులో అధికార టీడీపీకి చెందిన స్థానిక పంచాయతీ నాయకులు ముందు ఉండి ఆక్రమణలకు శ్రీకారం చుడుతున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో 2005లో అసైన్‌మెంట్ కమిటీకి ఉత్తర్వులు ఇవ్వడంతో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ డీయల్ రవీంద్రారెడ్డి డి.నేలటూరు పంచాయతీలో ఉన్న బీసీ, ఎస్సీ, ఓసీ నిరుపేదలకు ఒక్కొక్కరికి 3 నుంచి 5 ఎకరాల వరకు భూ పంపిణీ చేశారు. డీ పట్టాలు కూడా పొందారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డి.నేలటూరు పంచాయతీ పరిధిలో ఉన్న అధికార పార్టీ నాయకులు నిరుపేదలకు ఇచ్చిన భూములపై పడ్డారు. నాయకులు వాటాలుగా పంచుకొని రాత్రి వేళ్లలో బోర్లు వేయడం.. దోజర్లతో చదును చేయడం ప్రారంభించారు. డీ పట్టాలు ఉన్న బీసీలు, ఎస్సీలు అడ్డుకొనేందుకు వెళ్లినా నీ భూమి ఇక్కడ లేదు ఎక్కడో ఉంది అక్కడికి వెళ్లు.. అని భయానికి గురి చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. వందలాది ఎకరాలు ఆక్రమణలకు గురి అవుతున్నా రెవిన్యూ అధికారులు మాత్రం అటువైపు చూడనట్లు ఉన్నారు.

కాగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాత్రం ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులకు చెప్పానని అంటున్నారు. మరి ఆయన మాటలు వారు విననట్లు ఉంది. పేదల భూములు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నా చర్యలు మాత్రం శూన్యం.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

వన్య ప్రాణులను వేటాడిన నిందితుల అరెస్టు

ములకలచెరువు : అడవి పందులను వేటాడే ఇద్దరిని అటవీ శాఖ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. మదనపల్లి ఎఫ్ఆర్వో జయప్రసాద్‌రావ్, ములకలచెరువు సెక్షన్ ఆఫీసర్ ముబీన్‌తాజ్‌లు తెలిపిన వివరాల మేరకు..

మండల పరిధిలోని బురకాయలకోట, వేపూరికోట, నేరేడికొండ ప్రాంతాల్లో వన్య ప్రాణులను వేటాడి, మాంసం తరలిస్తున్నట్లు ముందస్తుగా సమాచారం అందిందన్నారు. అనంతరం అటవీ సిబ్బంది మండల పరిధిలోని ఒడ్డిపల్లి సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాల్లో తనిఖీలు చేపట్టగా సత్యసాయి జిల్లా కదిరి వీరాస్ కాలనీకి చెందిన బాలాజీ (23), మండలంలోని రామాపురానికి చెందిన మంజునాథ్ (30)లు మాంసం, మారణాయుధాలతో పట్టు బడ్డారన్నారు. నిందితులకు రిమాండ్‌కు తరలించామని తెలిపారు.